క్లుప్తంగా

రుగడ పోలమ్మను దర్శించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అలజంగి జోగారావును పూలమాలతో సత్కరిస్తున్న సర్పంచ్ దంపతులు

సీతానగరం: మండలంలోని ఎస్ఎస్‌పురంలో గల రుగడ పోలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ప్రతి మూడేళ్లకోసారి రుగడ పోలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని, అమ్మవారి చల్లని దీవెనలు అందించాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఎస్‌పురం సర్పంచ్ దంపతులు దుర్గ, తిరుపతిరావు ఎమ్మెల్యే అలజంగి జోగారావును శాలువతో సత్క రించారు. అలాగే గ్రామ పెద్దలు రవి, అప్పయ్యలు ఎమ్మెల్యేకు అమ్మవారి దీవెనలు అందించాలని పూజలు చేసినట్లు తెలియజేశారు.

రెసిడెంట్ డాక్టర్‌గా శ్యామల



పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రి సీనియర్ రెసిడెంట్ మెడికల్ అధికారిగా డాక్టర్ కె. శ్యామల బాధ్యతలు నిర్వహిస్తారని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. బి.వాగ్దేవి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను డాక్టర్ ఎస్‌కేఆర్ఎస్ శేషగిరి నిర్వహించేవారని, పాలనాపరమైన అంశాల్లో భాగంగా ఈ మార్పు జరిగినట్లు ఆమె పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ చేపడుతున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సీతానగరం: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మండలంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రహదారిపై లచ్చయ్యపేట, పణుకుపేట జంక్షన్, చినభోగిలి రైల్వేస్టేషన్ జంక్షన్‌లలో వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సురేష్ మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వాహనాల్లో అనుమతులు లేకుండా నగదు తరలించరాదని, నిషేధిత సరుకులు తరలించడం నేరమన్నారు. వాహనాల తనిఖీలో నగదు, నిషేధిత సరుకులు పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



గదబవలసలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పార్వతీపురం: సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభించినట్లు ఎంపీడీఓ షేక్ మహమ్మద్ అకిబ్ జావేద్ తెలిపారు. ఈ మేరకు మండలంలో 11,057 పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాలమేరకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులకు వారి ఇంటివద్దనే పింఛన్‌ను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని వెంకంపేట, సంగంవలస, గదబవలస, ఎంఆర్‌నగరం, జమదాల గ్రామాలలో పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికకు సంబంధించి పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం కోసం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను తహసీల్దార్ కె.ఆనందరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు గదులు, భద్రతా దృష్ట్యా చేపట్టాల్సిన చర్యల గురించి సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీకెమెరాల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- నియోజకవర్గానికి రూ.1540 కోట్లు అందజేత
- పార్వతీపురంలోఎమ్మెల్యే జోగారావు ఎన్నికల ప్రచారం



2, 28వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురంటౌన్: అభివృద్ధి, సంక్షేమం ద్వారా పార్వతీపురం నియోజకవర్గానికి రూ.1540 కోట్లు ప్రభుత్వం అందజేసిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచి నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల 2, 28వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్న అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారాన్ని గడపగడపకు వెళ్లి చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

విద్య, వైద్యానికి వేల కోట్లు

విద్య, వైద్య వ్యవస్థల్లో సమూలంగా ప్రక్షాళన చేసి వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసి నేడు దేశంలోనే గర్వించ తగ్గట్టుగా రాష్ట్రంలో విద్య, వైద్య వ్యవస్థలను మెరుగుపరిచారని చెప్పారు. మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారి పేరిట అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని గుర్తు చేశారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలే మళ్లీ తమ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో గెలిపించి తీరుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్దామని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని మన ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకుసాగేలా చేసుకుందామని పిలుపునిచ్చారు. అందుకు మీ అందరి దీవెనలు, మద్దతు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్ సభ్యులు మజ్జి శశికర్, కోరాడ శ్రీనివాసరావు, సువ్వాడ లావణ్య, నిమ్మకాయల సుధీర్ కుమార్, రణభేరి చిన్నంనాయుడు, ఎడ్ల త్రినాథ, తాడ్డి శంకర్రావు, ఆకుల శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీను, నాయకులు గృహసారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే జగనన్న అజెండా



ప్రచారంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- పాంచాలిలో ఎన్నికల ప్రచారం

పాచిపెంట: ప్రజలకు మంచి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పాచిపెంట మండలంలోని పాంచాలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శనాపతి నారాయణరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన ప్రియతమ నేత రాజన్నదొరకు ప్రజలు, నాయకులు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు వేసి హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికి అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా లక్షల కోట్ల రుపాయలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమచేశారన్నారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్ రెడ్డి కాగా, ప్రజలను మోసం చేసింది చంద్రబాబు అని అన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్‌ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యజ్జల వెంకటరావు, బోను ధనుంజయ, టి.గౌరీశ్వరరావు మూకల అప్పారావు, దండి కొండలరావు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం



దొంగతనాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఎం.అప్పారావు

పార్వతీపురం టౌన్: దొంగతనాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ క్రైం సీఐ ఎం.అప్పారావు సూచించారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్ల వద్ద దొంగతనాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళలో జరుగుతున్న దొంగతనాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ ప్రాంతాల పరిధిలో వచ్చే అనుమానిత వ్యక్తులను ఓ కంటకనిపెట్టాలని చెప్పారు. వేసవి కాలంలో ఆరుబయట పడుకునే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. రానున్న వేసవి సెలవుల్లో దూర ప్రాంతాలకు వెళ్లేవారంతా ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో పాటు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనుమానిత వ్యక్తులను గుర్తించి తక్షణమే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ క్రైం స్టేషన్ ఎస్సై ఎంపీ రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

- డీఐఓ టి.జగన్‌మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించి, నివేది కలు సకాలంలో అందజేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో డీఎంఓ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రికి ప్రతిరోజూ ఆరోగ్య తనిఖీల కోసం వస్తున్న వారిలో, క్షేత్రస్థాయిలో చేపడుతున్న సర్వేలెన్స్‌లో జ్వర లక్షణాలున్న వారి నుంచి సేకరించిన రక్తపూతల నమూనాలకు సకాలంలో పరీక్షలు చేసి నివేదికలు వెంటనే అందజేయాలని సూచించారు. అలాగే వివరాలు ల్యాబ్ రికార్డులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే ఐహెచ్ఐపీ పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. తద్వారా క్షేత్రస్థాయి సిబ్బంది ఆ ప్రదేశంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్స్, హెల్త్ సూపర్‌వైజర్స్ సందర్శనల వివరాలతో నెలవారీ ప్రణాళికను (టూర్‌డైరీ) కార్యాలయానికి అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఈఓ నాగేంద్ర, ఎంటీఎస్‌లు, కార్యాలయ సిబ్బంది, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల, ప్రాంతీయ, జిల్లా, కమ్యూనిటీ ఆస్పత్రుల ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

దారి మారింది



నాడు: అధ్వానంగా ఉన్న పార్వతీపురం-కొమరాడ రహదారి



నేడు: తళతళ లాడుతున్న రహదారి

పార్వతీపురం టౌన్: గ్రామీణ రహదారుల దశ తిరిగింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులు నేడు తళతళ మెరిసిపోతున్నాయి. పార్వతీపురం-కొమరాడ రహదారి ఒకప్పుడు గుంతలతో ఉండేది. ఆ రోడ్డుపై రాళ్లు తేలి ప్రయాణం నరకంగా ఉండేది. ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఈ రోడ్డు ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో రహదారుల దశ మారింది. ఆర్అండ్‌బీ నిధులు వెచ్చించి రూ.1.60 కోట్లతో నూతన రహదారి నిర్మాణం పూర్తిచేశారు. నాడు గుంతలుగా ఉన్న రహదారులు నేడు తళతళ మెరిసిపోతున్నాయి. నూతన రహదారులు నిర్మించిన ప్రభుత్వానికి ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ



మామిడిపల్లిలో పెన్షన్లు కోసం క్యూలో ఉన్న వృద్ధులు

సాలూరు రూరల్: మండలంలోని కొన్ని సచివాలయాల్లో పెన్షన్‌ల పంపిణీని బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సచివాలయ సిబ్బంది ప్రారంభించారు. మామిడిపల్లి, పెదపదం, జీగిరాం పంచాయతీల్లో పెన్షన్లు 60శాతం వరకు పంపిణీ చేశామని ఆయా పంచాయతీల సెక్రటరీలు తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు సచివాలయాల్లో పెన్షన్ తీసుకోవాలన్న సమాచారంతో వృద్ధులు, మహిళలు మధ్యాహ్నం సచివాలయాల వద్దకు చేరుకున్నారు. సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ చేస్తున్న సమయంలో క్యూలో నిల్చొలేక వృద్ధులు ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితికి కారణమైన వ్యక్తి చంద్రబాబునాయుడికి లబ్ధిదారులు శాపనార్థాలు పెట్టారు.

పిల్లల పట్ల తల్లులు జాగ్రత్తగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాణి

సాలూరు రూరల్: పిల్లల పెంపకంలో తల్లులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ పీడీ రాణి అన్నారు. ఈ మేరకు బుధవారం సాలూరు విచ్చేసిన ఆమె మండలంలోని శివరాంపురం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త జరజాపు పార్వతి పిల్లల తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పీడీ మాట్లాడుతూ పిల్లలను తప్పనిసరిగా అంగనవాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని పిల్లలకు తప్పనిసరిగా అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

పాలకొండ: ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని డీఎస్పీ కృష్ణారావు సూచించారు. పాలకొండ-శ్రీకాకుళం రహదారిలోని చెక్‌పోస్టును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలకు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనల మేరకు నగదు తరలింపులు ఉండాలని, అంతకు మించి తరలిస్తే అనుమతులు తీసుకోవాలని తెలిపారు. వివాదస్పదంగా ఎవరు వాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శివదీక్షా ఉపనయనములు



ఉపనయన దీక్షలు చేపట్టిన కళింగ వైశ్య యువత

వీరఘట్టం: స్థానిక రమా సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన యువత శివదీక్షా ఉపనయనములు చేపట్టారు. పార్వతీపురానికి చెందిన వేదపండితులు రమణమూర్తి, రామకృష్ణశర్మ వీరికి దీక్షా కంకణాలు కట్టారు. దీక్షలు చేపట్టిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. స్థానిక కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన పూణ్ణ నగేష్, గ్యాస్ సురేష్, పూణ్ణ జనార్దన శ్రీనివాస్, స్వరూప్, శ్రీనుబాబు తదితరుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉపనయనముల దీక్షలు చేపట్టేందుకు వీరఘట్టం, జియ్యమ్మవలస, పార్వతీపురం,గరుగుబిల్లి,వంగర,పాలకొండ తదితర మండలాల్లోని కళింగ వైశ్య యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాలగుడబలో 80 మందికి వైద్యసేవలు



గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: మండలంలోని బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 80 మంది రోగులకు బుధవారం వైద్య సేవలు అందించామని వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారని, ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తారన్నారు. దాదాపు 13 రకాల వైద్యసేవలు అందుతాయని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు



బూర్జలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా ప్రజలు దాహార్తిని తీర్చడానికి మండలంలోని ప్రతి గ్రామంలో కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం బూర్జలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ జి.దాసు, ఎంపీటీసీ చిన్నంనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. తాజాగా పెదభోగిలి, బూర్జ, చెల్లంనాయుడువలస, నిడగల్లు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎండలు తగ్గుముఖం పట్టేవరకు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్ఆర్డీ కె.కుమార్‌వర్మ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వీప్ కార్యక్రమం



చెల్లంనాయుడు వలసలో నీ ఓటు నీభవిష్యత్ పై జరిగిన ర్యాలీ

సీతానగరం: ఓటర్లు వారి ఓటు వినియోగంపై అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని 120 వ పోలింగ్ కేంద్రం చెల్లంనాయుడు వలసలో స్వీప్ ర్యాలీని ఓటర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు చెప్పారు. పెదభోగిలి పంచాయతీలో ఉన్న పోలింగ్ కేంద్రాలు 140, 141, 142, 143 పరిధిలో స్వీప్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు వివరించినట్లు తెలిపారు. అలాగే గ్రామపెద్దలు, బూత్‌లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి వివరిస్తూ వారందరితో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కొదమ రోడ్డు పనులు



కొదమ గ్రామానికి వేస్తున్న రోడ్డు

సాలూరు రూరల్: ఏజెన్సీ గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరుగుతుందని దశాబ్దాలుగా ఎదురు చూసిన గిరిజనులకు ఎట్టకేలకు జగనన్న ప్రభుత్వంలో రాజన్నదొర చొరవతో దాదాపు అన్ని గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా కొదమ గ్రామానికి రూ.11 కోట్లతో చేపట్టిన 7 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం రాజన్నదొర శంకుస్థాపన చేశారు. అటవీ శాఖ అడ్డంకులు సైతం రాజన్నదొర చొరవతో తొలగిపోవడంతో ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గిరిశిఖర గ్రామాలకు రోడ్డు పనులు పూర్తయితే తమకు డోలీ కష్టాలు తీరుతాయని గిరిజనులు చెబుతున్నారు.

వాటర్ బెల్ అమలు పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: వేసవితీవ్రత దృష్ట్యా పాఠశాలల్లో విద్యార్థులకు మూడు సార్లు వాటర్‌బెల్ తప్పనిసరిగా అమలు చేయాలని పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని చర్చివీధి, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున పాఠశాలల్లో విద్యార్థులు డీహైడ్రేషన్ బారిన పడకుండా వాటర్ బెల్ అమలు చేయాలని విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆ మేరకు రోజుకు మూడుసార్లు ఉదయం 8:45, 10:05, 11:50 గంటలకు చిన్నారులు మంచినీరు తాగేందుకు వాటర్‌బెల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.